# ఒక క్షణంలో

తాపీగా ఆఫీసు చేరుకుని కుర్చీలో జారిగిలబడి వుత్తరీయంతో ముఖంమీది చెమట తుడుచుకొంటూ వుండగా జవాను ఒక కార్డు తెచ్చి శ్రీపతి ఎదురుగా వుంచాడు.

శ్రీపతి దాన్ని ఆత్రంగా అందుకుని చదువుకున్నాడు. ముఖంమీది చెమట మరింతయింది---- ఉత్తరీయం గట్టిగా ఊపుతున్నాడు.---- "రేపు సాయంకాలం సాహిత్యనందినిలో నాకు రేడియో టాక్ వుంది. మొదట్లో ఒక్కడినే వద్దామనుకున్నాను. కాని, మీ వదినగారు ఒక్కర్తే వుండలేనని మారాం చెయ్యడం వల ఇద్దరమూ బయలుదేరి గురువారం సాయంకాలానికి అక్కడికి వస్తున్నాం. శుక్రవారం సాయంత్రం రేడియోపని అయినాక, శనివారం వుదయమో సాయంకాలమో వీలును బట్టి తిరుగు ప్రయాణం చేద్దామనుకుంటున్నాం. మరదలుతో చెప్పగలవు----" అని ఆ వుత్తరం సారాంశం. శ్రీపతి గడియారం వంక చూచాడు. పదిన్నర. క్యాలండర్ వంక చూచాడు----గురువారం ఇరవయ్యో తారీఖు.

ఈ రోజు సాయంకాలమే తోడల్లుడూ, అతని భార్య దిగుతారన్నమాట! సాయంత్రం స్టేషనుకు వెళ్ళి వాళ్ళని రిసీవ్ చేసుకోవాలి! రైలు ఆరుగంటల పది నిమిషాలకు రావాలి. బహుశా లేటవుతుంది---- ఈ రోజుల్లో లేటవకుండా వచ్చే రైలుబండి లేదు కనక! ఏమయినా ఆరున్నరలోపుగా స్టేషనుకి వెళితే చాలు! మరి సాయంకాలం పర్మిషనూ అదీ పెట్టనక్కర్లేదు. అయిదింటికే బయలుదేరి మధ్యలో మజిలీలన్నీ మానివేసి తిన్నగా ఇంటికి వెళ్ళాలి. లలితతో ఈ సంగతి చెప్పాలి. చెప్పడంలో చిన్న తమాషా చెయాలి. ఇంటి కెళ్ళగానే ఫలానావాళ్ళు ఫలానా రైలుకు వస్తున్నారు----అని చెప్పెయ్యకూడదు. కాసేపు ఆమెని సస్పెన్స్‌లో వుంచి చివరకు---- అంటే దాదాపు క్లయిమాక్స్ రీచ్ అయినాక----చెప్పాలి. చెప్పగానే ఆమె ముఖ కవళికలు

ఎలా మారుతాయో గమనించాలి. బహూశా పరమానందంతో ముఖం పదింతలవుతుంది. పరమ సంతోషంతో ముఖారవిందం వికసిస్తుంది. ఒక అరగంట ఈ ఫార్స్ అయినాక ---- అంటే అప్పటికి టైం సుమారు ఆరు గంటలవుతుంది---- తిన్నగా తను బయలుదేరి స్టేషనుకి వెళ్ళవచ్చును. అక్కడకు చేరుకునేసరికి ఆరూపదీ, ఆరూ పదిహేనూ అవుతుందేమో! రైలుబండి కరెక్టుగా టైంకే వచ్చినా ఇబ్బంది వుండదు. కాక, అరగంటో ముప్పావుగంటో లేటు అంటే---- ప్లాటుఫారం మీద నాలుగుసార్లు అటూఇటూ పచార్లు చేయవలసి వస్తుంది. రెండు సిజర్ సిగరట్లు తగలేయవలసి వుంటుంది. కాకపోతే హిగిన్ బాదమ్స్ బుక్‌స్టాల్ దగ్గిర కాసేపు ఖుషీగా గడపొచ్చు. తాను చిరకాలంగా వాంఛిస్తూనూ కొనుక్కోలేని మామ్, సాత్రే, అనటోల్ ఇలాంటి మహామహుల పుస్తకాలు అందంగా షోకేస్‌లో పేర్చి వుంచటం చూచి గుటకలు మింగవచ్చు. ఏదయినా ఛీప్ డిటెక్టివ్ ఎనిమిదణాలదో, ఆరణాలదో అక్కడ కూచున్న కాసేపట్లోనూ చదివి పారేయవచ్చు. రైలుబండి రావడంతోటే వాళ్ళున్న కంపార్ట్‌మెంట్ పసికట్టేసి తిన్నగా అక్కడకు వెళ్ళి, సామాన్లూ వగయిరా జాగ్రత్తగా దింపించి---- గుర్రపుబండి మాట్లాడి దాంట్లో వాళ్ళను ఇంటికి తీసుకురావాలి! అంతే! అక్కడికి తనపని అయిపోతుంది. అతిధులకు చేయవలసిన మర్యాదలు వగయిరా అంతా ఇక లలితవంతు!---- ఆలోచన ఇంతదూరం వచ్చిన మీదట శ్రీపతికి ఆకస్మాత్తుగా ఇంటిదగ్గర లలిత చెప్పిన ముక్కలు గుర్తుకి వచ్చాయి. ఉక్కిరి బిక్కిరి అయినట్లయింది. దిక్కుతోచకుండా అయింది మనస్థితి. ఉన్నట్లుండి ఎడారిలో విసరివేయబడినట్లు అనిపించింది.

ఆఫీసుకు బయలుదేర బోతుండగా లలిత అంది:

"నెయ్యి అయిపోవచ్చింది. సాయంత్రానికి వుంటుందేమో---- పోతే నూనెకూడా ఒకటి రెండు రోజుల్లోనే అయిపోతుంది. పొద్దున్నే ఉప్పు అయిపోతే ఒకశేరు తెప్పించాను----నా దగ్గర అరిగిన అణా ఒక టుంటేను. చింతపండు కూడా అయిపోవచ్చు. నెలకు వీశెడు తెప్పించినా, చెంబులు తోమడంకిందే అయిపోతుంది--- పనిమనిషికి. మరి ఎప్పుడు తెచ్చి పడేస్తారో మీదయ. మళ్ళీ చెప్పలేదని నా మీద కసురుకుంటే లాభంలేదు."

అప్పుడే శ్రీపతికి కాళ్ళ కింది నేల జారినట్లనిపించింది. నిన్నటినుంచే జేబులో దమ్మిడి లేకుండా అయిపోయింది. పోతే ఇల్లాలు తయారు చేసిన పట్టీ అయిదారు రూపాయలదాకా ఔతుంది. కాగా, నేలాఖరుదాకా కూరగాయలు----ఇంకా ఇతర చిల్లర ఖర్చులకు కావాలి కదా!----ఎట్లా సాధించడమా అని ఆలోచిస్తూ ఆఫీసు చేరుకునే సరికి----ఇదిగో ఈ ఉత్తరం ఒకటి వచ్చి కూర్చుంది!

శ్రీపతికి మనసంతా ఆకస్మాత్తుగా చీకాగ్గా అయిపోయింది. ఒక్కసారిగా అగాధంలోనికి దూకినట్లయింది. తన సంసారపు ఖర్చులు మామూలుగా అట్లా వుండగా అనుకోకుండా ఇంటికి వస్తున్న చుట్టాల గురించి ఇప్పుడు మరో సమస్య ఏర్పడుతోంది! వాళ్ళను స్టేషనుకు వెళ్ళి రిసీవ్ చెయ్యటం సరదా గురించి ఇందాకటి నుంచి మనసులో వూహాగానం చేసుకుని వుర్రూతలూగుతున్నాడు. కాని, ఇప్పుడు ఏమయింది? ఏదో ఉపద్రవం జరిగింది. స్టేషనుకి వెళ్ళి వాళ్ళను తీసుకు రావటానికే కనీసం రెండు రూపాయలన్నా పడుతుంది. అప్పుడే రైలు దిగి ఇంటికి వస్తున్న వాళ్ళచేత బండి బాడుగ ఇప్పించటం బాగుంటుందీ? అట్లాగని చూస్తూ వూరుకోవడం ఎట్లాగ? ఇవ్వాలంటే ఎలాగూ చేతిలో లేదు.

శ్రీపతి చాలా సేపు ఆలోచనలో పడిపోయాడు.

పదకొండున్నర గంటలు దాటి---- టైం పన్నెండు కూడా కావస్తున్నది.

అయినా ఆఫీసుపని ముట్టుకోబుద్ధి కావడం లేదు.

ఏమయినా సరే సాయంత్రం అయిదు గంటల లోపల తను పదిరూపాయలు సంపాదించాలి.

ఎట్లా వస్తాయి?

తల్చుకున్నంతనే కోరికలు తీర్చే కామధేనువు తన దగ్గర లేదు కదా! కల్పవృ క్షం తన దగ్గర లేదు కదా!

శ్రీపతికి తన అసహాయతకు చాల సిగ్గనిపించింది. తన చేతకానితనానికి తనమీదే కోపం వచ్చింది. చేతిలో పది రూపాయలన్నా వుండకుండా----తొమ్మిదేళ్ళుగా చేస్తున్న ఉద్యోగం మీద విపరీతంగా కోపం వచ్చింది.

కాని----కాని ఏం చెయ్యడం?

-----సాయంత్రం లోపుగా పది రూపాయలన్నా సంపాదించాలి. ఎట్లా వస్తాయి?

సంపాదించే జీతం చాలదు. ఇట్లాగే నెల రెండు కొసలు కలిపి బిగదీసి ముడివేస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. అనుకోని ఖర్చులు వస్తూ వుంటే ప్రాణం కడబట్టుతూంటుంది. గత్యంతరం అంటూ ఏమీ చేయగల్గింది లేదు కదా.

లోగడ శ్రీపతికి పై సంపాదన వుండేది. అంటే అక్రమంగా ---- లంచాలు వగయిరా తీసుస్తూ వుండేవాడని కాదు. యువకోత్సాహంలో, అప్పుడప్పుడూ తీరుబడిగా వున్నప్పుడు కథలూ వ్యాసాలూ వ్రాస్తూ వుండేవాడు.

ఈ రాసినవి పత్రికలకి పంపుతూ వుండేవాడు.

అవి పత్రికలలో ప్రచురితమై, అతనికి అడపా దడపా మనియార్డర్లు వస్తూ వుండేవి. ఆ డబ్బు కనీసం 'పాకెట్ మనీ'గా నయినా వుపయోగ పడుతూండేది.

కాని ఇప్పుడు శ్రీపతికి పత్రికలకంటూ ఏమైనా వ్రాసే తీరుబాటూ లేదు, వుత్సాహమూ లేదు.

ఆధ్యాస అసలే లేదు. అటువంటి ఆలోచనలే ఇప్పుడు కలగటం లేదు.

ఏం చేయడమా అని శ్రీపతిచాలసేపు ఆలోచించాడు. ఎంతసేపు ఆలోచించినా ఏమీ మార్గం దొరకడంలేదు.

ఆఫీసులోని వాళ్ళు తప్ప, బయటివాళ్ళు ఎవరూ అతనికి పరిచయం లేరు. బొత్తుగా పరిచయమే లేకపోయిన తర్వాత పది రూపాయలు అప్పంటూ అడిగే అవకాశం ఎక్కడుంది? పోతే ఇంక ఆఫీసులో వాళ్ళవిషయం మరీ అధ్వాన్నం. అంతా తనతో సమానంగానో, తక్కువగానో జీతం తీసుకుంటున్నవాళ్లే. అంతేకాకుండా అందరికీ కూడా పెద్ద పెద్ద సంసారాలు. వాళ్లలో చాల మంది బేడకు, పావలాకు తననే అప్పుడప్పుడూ బదులు అడుగుతూ వుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో తను ఎవరినని పట్టుమని పదిరూపాయలు అప్పు అడగటానికి అవకాశం వుంది?

----కాని తను ఇలా తనలోతనే మథనపడి వూరుకుంటే ప్రయోజనం ఏమిటి? ఏ పుట్టలోఏ పామువుండేది తను ఎరుగునా? ఇంతకూ తను అడిగే వేళా విశేషం మంచిదయితే---- తను లేచినవేళ మంచిదయితే రోజూ తనను కానీకి అర్ధణాకు వేధించుకు తినేవాళ్లే తన అవసరానికి పందరూపాయలయినా ఇవ్వగలగ వచ్చును!

ఇలా అనుకునే శ్రీపతి దాశరథిగారి దగ్గరికి వెళ్లాడు. ఆయన ఆఫీసు.కాగితల్లో పూర్తిగా మునిగిపోయివు న్నాడు. శ్రీపతి చెబుతూనే వున్నాడు గాని ఆయన వింటున్నాడో లేదో గమనించే స్థితిలో మటుకు లేదు. అతను చెప్పేదంతా సాంతంగా కూలంకషంగా విని దాశరథిగారు ఇలా అన్నారు; 'మీకు సమయానికి ఆదుకోలేకపోయినందుకు నాకెంతో విచారంగా వుంది. కాని ఏం చెయ్యను? నా దగ్గర చిల్లి దమ్మిడీ అయినా లేదు! ఈ వేళే ఎవరినైనా వో రెండురూపాయలు అడిగి తీసుకుందామనుకుంటున్నాను' అంటూ ఆయన

శ్రీపతి తనకు ఇదివరకు ఎన్నోమార్లు సమయానికి డబ్బు ఇవ్వడము - అందుకే తను ఎంతో ఋణపడి వుండడము---- కాని ఇప్పుడు తన దగ్గర ఏమీ లేకపోవడంవల్ల తన కృతజ్ఞతను నోటి మాటలతోనే వెల్లడించవలసి రావటం గురించి ఏమేమో చెప్పసాగాడు. శ్రీపతి ఇదంతా వినలేక తన సీటుకి వెళ్లి కూర్చున్నాడు. కూర్చున్న తరువాత ఆయనని ఎందుకు అడిగానా అనిపించింది. అవును మరి. లాభంలేదని తెలిసుండి కూడా ఈ అనవసర ప్రయత్నాలు ఎందుకు? ఈ ఆఫీసులో ఇంక ఎవరినీ అడిగికూడ లాభంలేదు. పోతే బయటి ప్రపంచంలో తనకి తెలిసిన వాళ్ళంటూ ఎవరూ లేరనీ ఇందాకనే రూఢి చేసుకున్నాడు. ఈ విషయం ఇంక పునరాలోచించి లాభం లేదు. ఆలోచించిన కొద్దీ ఇందాకటి మాదిరే పరాభవం గోచరమవుతుంది తప్ప ఇంకేంలేదు----అనిపించింది.

ఇలా ఏ ఆలోచన తెగకుండానే వుండగా, గడియారం అయిదుగంటలు కొట్టింది. ఆఫీసు టైం అయిపోయింది! అబ్బ. అప్పుడే! ఈవాళ తను ఆఫీసుకు వచ్చి కూర్చోవడమే గాని ఏమీ చిన్నమెత్తమయినా పని చేయలేదు. ఒక్క కాయితమన్నా చూడలేదు. ఇప్పుడు విచారించి మటుకు లాభమేమిటి? తిన్నగా ఇంటికి వెళ్ళి వుదయం తాను అనుకున్నట్లుగా కార్యక్రమం కొనసాగించాలి. కాని ఒక్కటే విచారం. డబ్బు దొరకలేదు. తన వూహలు, ఆలోచనలు ఎలా సాక్షత్కరిస్తాయో తెలియదు.

శ్రీపతి ఆఫీసు వదలి తిన్నగా ఇంటికి నడిచాడు. ఇల్లు చేరుకునే సరికి అయిదున్నర అయింది. లలిత మామూలుగానే ఎదురు వచ్చింది. అడగకుండానే కాళ్లకు నీళ్లు ఇచ్చి పై మీది ఉత్తరీయం తీసుకుంది. తాపీగా కూర్చున్న తర్వాత కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ తాగుతూ శ్రీపతి ఆవిడకు వుత్తరం అందించాడు. చదువుతూ వుండగా ఆమె ముఖ కవళికలు ఎలా మారుతున్నదీ గమనిస్తూ కాఫీ తాగుతున్నాడు. ఆవిడ ఉత్తరం చదవటం పూర్తిచేసి, 'మీతో అన్ని విషయాలు ఇంతే! అందరికీ తొందరయింది మీకు నిదానం! అందరికీ రహస్యాలు మీకు బట్టబయలు!' అంది. ఇలా అని అతనేమి వులకకుండా పలకకుండా వుండటం చూచి "ఏమండీ! అలా స్తంభంగా కూర్చుంటారేం! లేవండి. ముఖం కడుక్కుని---- స్టేషనుకు వెళ్ళరూ మరి! వాళ్ళరైలు వచ్చే టైముఅయిందిగా!" అని బుజాలు కుదిపింది.

"వెడతాను. లలితా, తప్పకుండా వెడతాను. కాని----"

"ఏమిటండీ---- మీ అనుమానం?"

"చేతిలో చిల్లిదమ్మిడీ అయినా లేదు. ఏమిటి చెయ్యడం?"----దాదాపు అప్రయత్నంగానే అన్నాడు. అంటూనే లలిత ముఖం వంక చూచాడు. ఇంతవరకు విప్పారినట్లున్న ఆమె ముఖం ఇప్పుడు అదో రకంగా అయింది. క్షణంపాటు జుగుప్స మీమాంస కనిపించాయి. తరువాత ఎందుకోగాని ముఖం కిందకుదించుకుని కాస్సేపు ఆలోచించింది లలిత. ఆవిడి ఏం ఆలోచిస్తుందో తనకు తెలిసినా తెలియనట్లే బాధపడుతున్నాడు శ్రీపతి.

"ఒక అయిదు రూపాయలుంటే చాలుగా!" అంది లలిత అయిదు నిమిషాలు గడిచాక!

"చాలటానికెక్కడ? కాని అయిదు మాత్రం ఎక్కడున్నాయి?"

"ఎదురింటి కమల నా దగ్గర దాచుకుంది ఓ అయిదు రూపాయలు! ఇస్తాను పట్టుకెళ్లండి."

"ఎవరు? శ్రీ రాంమూర్తి పెళ్లాం కమలా? మరి ఆ అమ్మాయి రేపు పొద్దున్నే అడిగితేనో?"

"అడగదు. నాకు తెలుసుగా! మళ్లీ జీతం వచ్చాక సర్దుబాటు చేస్తే చాలు!" అంటూ లలిత పెట్టె తెరచి అయిదు రూపాయలనోట్లు శ్రీపతి కిచ్చింది.

"ప్రస్తుతం ఒక్కటి చాలు" అంటూ శ్రీపతి ఒక్క రూపాయే జేబులో పెట్టుకున్నాడు.

"మీరు సరాసరి స్టేషన్లో వాళ్లను కలుసుకోండి. ఈలోపల నేను ఎవరన్నా కుర్రాడిచేత ముఖ్యంగా ఈ రెండు రోజులకు కావల్సిన సరుకులు తెప్పించేస్తాను! ఉ----తెమలెండి మరి!" అంటూ తొందర పెట్టింది లలిత.

శ్రీపతి వుదయం నుంచి తను రకరకాలుగా సతమతమవుతున్న సమస్య ఒక్క నిమిషంలో తన భార్య మంచులా విప్పినట్లు చేయడంతో దిగ్భ్రమ చెందాడు. మనసులో చాల సంతోషపడ్డాడు. లలితకి థాంక్స్ చెప్పాడు. కాని, ఆపద గడుపుతున్న ఈ అయిదు రూపాయలు పొరుగింటి శ్రీరాంమూర్తి పెళ్లాం కమలవి కావనీ, లలితే తను అప్పుడప్పుడు పోగుచేసుకున్న చిల్లర ఇలా కాగితాలుగా మార్చి దాచుకుందనీ శ్రీపతికి తెలీదు. తెలిస్తే అతను ఇంకా ఎంత సంతోషిస్తాడో! ❋

*(ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక)*